క్లుప్తంగా

పీహెచ్‌సీని సందర్శించిన అసిస్టెంట్ కలెక్టర్



పీహెచ్‌సీలో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ రాధిక

కామేపల్లి(కారేపల్లి): కామేపల్లి పీహెచ్‌సీని అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించిన ఆమె చికిత్స కోసం వచ్చిన వారితో సేవలపై ఆరా తీశారు. వైద్యులు, సిబ్బంది మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. వైద్యాధికారి నెల్లూరి చందన, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ ఆదెర్ల శంకర్‌రావు ఉన్నారు.

నేడు మిర్చి రైతులకు అవగాహన సదస్సు

రఘునాథపాలెం: మండల కేంద్రమైన రఘునాథపాలెం రైతు వేదికలో బుధవారం ఉదయం 10 గంటలకు మిర్చి రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఇంటూరి భాస్కరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా వ్యవసాయశాస్త్ర వేత్తలు డాక్టర్ హేమంత్‌కుమార్, హైబ్రిడ్ సీడ్స్ అధినేత మన్నెపల్లి రవి తదితరులు హాజరు కానున్నారని రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఏఓ కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



26వ డివిజన్‌లో శంకుస్థాపన చేస్తున్న మేయర్

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని పలు డివిజన్‌లలో అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్‌లు మంగళవారం శంకుస్థాపనలు చేశారు. 25, 26 డివిజన్‌లలో బీటీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గోళ్ల చంద్రకళ వెంకట్, డీఈలు స్వరూపరాణి, ధరణికుమార్, ఏఈ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ ఉద్యోగికి నివాళి

కేఎంసీ టౌన్ ప్లానింగ్ ఉద్యోగి గద్దం భాగ్యలక్ష్మి సోమవారం రాత్రి మృతి చెందారు.ఈమేరకు కరుణగిరిలోని ఆమె నివాసంలో మంగళవారం భాగ్యలక్ష్మి మృతదేహం వద్ద మేయర్ నీరజ, అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి నివాళులర్పించారు.

వాటర్ కూలర్ ప్రారంభం

ఖమ్మంవ్యవసాయం: వేసవిని దృష్టిలో పెట్టుకొని ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లోని పత్తి యార్డులో ఏర్పాటు చేసిన వాటర్ కూలర్‌ను మంగళవారం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేషం, వైస్ చైర్మన్ షేక్ అఫ్జల్, ద్వితీయ శ్రేణి కార్యదర్శి బి.బజార్, సహాయ కార్యదర్శులు రాజేంద్రప్రసాద్, నిర్మల, ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణతో పాటు చుంచు పాండురంగారావు, బి.రమేష్, చిన వెంకటేశ్వర్లు, కార్మిక సంఘాల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సార్
వినోద	బలగం
సాయిరాం	జాన్ విక్: చాప్టర్ 4
ఆదిత్య	కబ్జా
శ్రీనివాస	దాస్ కా దమ్కి
సుందర్	రంగమార్తాండ

- ఖమ్మంవ్యవసాయం

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	2
వంకాయ	26		10
బెండకాయ	40	పాలకూర	3
పచ్చిమిర్చి	40		20
కాకర	36	చుక్కకూర	2
బోడ కాకర	80		10
బీర	56	తోటకూర	2
దొండ	38		10
పొట్లకాయ	30	గోంగూర	2
చిక్కుడు	70		10
గోరుచిక్కుడు	46	మెంతికూర	5
క్యాబేజీ	16		20
క్యాలీఫ్లవర్	25	కొత్తిమీర	1
ఆలుగడ్డ	20		15
చామగడ్డ	50	పుదీన	1
క్యారెట్	24		15
క్యాప్సికం	60	-ఖమ్మం వ్యవసాయం	

కొత్త పంచాయతీ కష్టాలు!

సమస్యల నడుమ లింగారంతండా..

- రోడ్లు, వీధి దీపాలు లేక ఇక్కట్లు
- వానాకాలంలో చిత్తడిగా మారుతున్న రహదారులు
- కలెక్టర్ దృష్టికి వెళ్లినా ఫలితం శూన్యం
- పంచాయతీ భవనానికి మంజూరుకాని నిధులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



తండాలోని ఓ రోడ్డు (ఇన్‌సెట్) లింగారంతండా - గన్యాతండా మధ్య రహదారి దుస్థితి(ఫైల్)

కూసుమంచి: మండలంలోని లింగారంతండా కొత్తగా ఏర్పడిన గ్రామపంచాయతీ. గతంలో ఈ పంచాయతీ గట్టుసింగారం గ్రామ పరిధిలో ఉండేది. నూతన గ్రామ పంచాయతీల్లో భాగంగా గన్యాతండాను కలుపుకుని నూతన పంచాయతీగా ఏర్పడింది. నాటి నుంచి నేటి వరకు ఈ పంచాయతీలో ఉన్న పలు సమస్యలతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం తమకేమి పట్ట పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

దొంకదారే దిక్కు..

లింగారంతండా నుంచి గన్యాతండాకు మధ్య కిలోమీటరుకు పైగా దూరం ఉంటుంది. గన్యాతండాలో శ్మశానవాటిక, పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డ్‌కు స్థలాలు ఉండటంతో వాటిని అక్కడే నిర్మించారు. దీంతో లింగారంతండా గ్రామస్తులు వాటిని వినియోగించుకోవాలంటే కిలోమీటరు దూరంలో ఉన్న గన్యాతండాకు వెళ్లాల్సి వస్తోంది. ఇక గన్యాతండా గ్రామస్తులు లింగారంతండా గ్రామ పంచాయతీ కార్యాలయం, రేషన్ దుకాణం, పాఠశాలలకు పిల్లలు రావాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఇరు తండాల మధ్య ఉన్న రహదారి డొంకదారి కావటం.. అది మట్టిరోడ్డు కావడంతో వర్షం వస్తే వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. గతంలో పనిచేసిన కలెక్టర్ కర్ణన్.. ఇదే దారిలో రాలేక నానా ఇబ్బందులు పడ్డారు. నాడు కలెక్టర్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినా నేటికి పరిష్కారం కాలేదు.

వేధిస్తున్న సమస్యలు..

ఇక తండాలలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు లేక తండావాసులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. వర్షాకాలం వస్తే చాలు వారి బాధ వర్ణణాతీతం. అదేవిధంగా పంచాయతీలో వీధి దీపాలకు స్తంభాలు ఏర్పాటు చేసే పరిస్థితి లేక రాత్రిళ్లు ఇబ్బంది పడాల్సి వస్తోంది. మంచినీటిని సరఫరా చేసే మోటార్లకు ప్రత్యేక విద్యుత్‌లైన్ లేదు. దీంతో తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. తండాకు నూతన గ్రామపంచాయతీ భవనం మంజూరైనా ఇంకా నిధులు మంజూరు కాలేదు. దీంతో అద్దె భవనంలోనే పంచాయతీ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ఇకనైనా ఎమ్మెల్యేతో పాటు అధికారులు సైతం తాండాలపై దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

రోడ్లు నిర్మించాలి..



మా గ్రామ పంచాయతీ నుంచి గన్యాతండా వెళ్లాలన్నా.. గతంలోని గట్టుసింగారం వెళ్లాలన్నా రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయి. వానాకాలం నడవ లేని పరిస్థితి లేదు. ఏళ్లు గడిచినా పట్టించుకునే నాథుడే లేడు. ఇకనైనా పంచాయతీలో సీసీ రోడ్లు వేయాలి. – వి.హేమ్లా, తండా వాసి

నిధులు మంజూరు చేయాలి..



మా తండాకు నిధులు మంజూరు చేసి సమస్యలు తీర్చాలి. వీధి దీపాల కోసం విద్యుత్ స్తంభాలు వేయాలి. గన్యాతండా రహదారిని వెడల్పు చేసి బాగు చేయాలి. తండాలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే గుర్తించి పరిష్కరించాలి.

– బానోత్ నాగేశ్వరరావు, సర్పంచ్

సహకార సంఘాల బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీనివాసరావు

నేలకొండపల్లి: సహకార సంఘాల బలోపేతానికి శక్తి వంచన లేకుండా ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు డీసీఎంఎస్ డైరెక్టర్, పైనంపల్లి సొసైటీ చైర్మన్ నాగుబండి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం మండలంలోని పైనంపల్లి సొసైటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం ఆర్థిక లావాదేవీలపై నివేదిక అందించగా.. రైతులు పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సొసైటీ నుంచి త్వరలో డ్రోన్స్ స్ప్రేయర్‌ను కొనుగోలు చేసి రైతులకు అందుబాటులో ఉంచనున్నామని రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఉసిరికాయల లక్ష్మయ్య, ఉప సర్పంచ్ నరసమ్మ, మండల రైతు బంధు సభ్యులు మారగాని పద్మారావు, గ్రామ రైతు కన్వీనర్ వీరారెడ్డి, సొసైటీ సీఈఓ జగదీష్, రైతు ప్రతినిధులు కలకుంట్ల శ్రీను, దుర్గాప్రసాద్, వెంకటేశ్వర్లు, జ్ఞానరత్నం తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పెట్రోలింగ్

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంరూరల్: ఏదులాపురం పరిధిలోని వెంపటినగర్, బైపాస్‌రోడ్లలో సోమవారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ ముమ్మరం చేశారు. ఈ నెల 27న 'రోడ్డు ఎక్కాలంటే భయం భయం'అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు స్పందించిన పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. రూరల్ ఏసీపీ బస్వారెడ్డి సాక్షితో మాట్లాడుతూ.. బైపాస్‌రోడ్, సమీప కాలనీల్లో లారీలు నిబంధనలకు విరుద్ధంగా ఆగకుండా చూస్తామని, అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారిస్తామన్నారు. సమీప వెంచర్లలో మద్యం సేవించడం, స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తే వారిపై సీరియస్‌గా వ్యవహరిస్తామని హెచ్చరించారు. అదే విధంగా గంజాయి అమ్మకాలు కూడా తమ దృష్టికి వచ్చాయని ఈ విషయమై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిఅమ్మకాలను నివారిస్తామని తెలిపారు.

వసతి గృహాల సమస్యలపై వినతి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఉన్న సాంఘిక, సంక్షేమ శాఖ ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యాన మంగళవారం డీడీ సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్ మాట్లాడుతూ.. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, పలుచోట్ల ఫ్యాన్లు, కరెంట్, బాత్‌రూంలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అద్దె భవనాల్లో నడుపుతున్న హాస్టళ్లకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు మణికంఠ, సాగర్, ప్రభు, చలపతి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు..

రఘునాథపాలెం: రఘునాథపాలెంలోని నర్సింహులగుట్టపై నరసింహస్వామి దేవాలయం నిర్మాణానికి సర్వే నంబర్ 218లో ఐదు ఎకరాల భూమి కేటాయించాలని కోరుతూ మంగళవారం గ్రామస్తులు తహసీల్దార్ నరసింహరావుకు వినతి పత్రం అందించారు. పురాతనం నుంచి దేవుడు పేరుతో ఉన్న గుట్టపై పెద్దలు పూజలు చేసేవారని, దాన్ని దృష్టిలో పెట్టుకొని గుట్టపై దేవాలయ నిర్మాణానికి భూమి కేటాయించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విషయం మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వినతి ఇచ్చిన వారిలో గ్రామ సర్పంచ్ శారద, గుడిపుడి రామారావు, బి.నంద్య, శ్రీనివాసరావు, రాములు, ఐలేశ్వరరావు, లింగయ్య, సంగయ్య తదితరులు ఉన్నారు.

వచ్చే నెల 7న ఎన్నికలు

కూసుమంచి: మండలంలోని గట్టుసింగారం గ్రామంలో ఏర్పాటు చేసిన లింగమంతుల స్వామి ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘం పాలక మండలి ఎన్నికలను వచ్చే నెల 7న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి ఎస్‌వీఎస్ ప్రసాద్ తెలిపారు. గ్రామంలోని పశువైద్య ఉప కేంద్రంలో బ్యాలట్ పద్ధతిలో జరుగు ఈ ఎన్నికలకు మార్చి 29, 31తో పాటు ఏప్రిల్ 1వ తేదీన నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. 2వ తేదీన నామినేషన్ల పరిశీలన, 3వ తేదీ ఉపసంహరణ ఉంటుందన్నారు. తొమ్మిది డైరెక్టర్ స్థానాలకు జరిగే ఈ ఎన్నికల్లో మహిళలకు 2, జనరల్ కేటగిరిలో 7 స్థానాలు రిజర్వ్ చేశామని ప్రసాద్ తెలిపారు. సభ్యత్వం కలిగి పోటీలో పాల్గొనే ఎస్సీ, ఎస్టీలు రూ. 500, బీసీలు రూ.750, ఓసీలు రూ. 1,000 నామినేషన్ రుసుం చెల్లించాల్సి ఉంటుందని ఎన్నికల అధికారి పేర్కొన్నారు.

అన్నం ఆశ్రమంలో అన్నదానం

ఖమ్మంఅర్బన్: నగరంలోని అన్నం సేవా ఫౌండేషన్ అనాథ ఆశ్రమంలో మంగళవారం నగరానికి చెందిన శిరం వినాయక హనుమంతరావు(గణేష్) జ్ఞాపకార్థం 5వ రోజు సందర్భంగా 250 మందికి కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబసభ్యులు భార్య కమలకుమారి, కుమారులు శిరం వీరభద్ర, వెంకటనరసింహ గుప్తా, లక్ష్మీనరసింహ కృష్ణ ప్రసాద్ గుప్తా, అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, ప్రముఖ సామాజికవేత్త కడవెండి వేణుగోపాల్, అమరేశ్వరరావు, కేశవపట్నం శ్రీనివాసరావు, గడ్డం శ్రీనివాసరావు, ప్రవీణ్‌లు తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: బ్రెయిన్ కేన్సర్‌తో బాధపడుతున్న ఖమ్మం నగరంలోని గోపాలపురానికి చెందిన యువతి చావ మౌనిక చౌదరికి ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. మంగళవారం కుటుంబ సభ్యుల సమక్షంలో ఈ నగదును అందించారు. మెరుగైన చికిత్స అందించే విధంగా ఏర్పాట్లు చేయించాలని పొంగులేటి తన కార్యాలయ సిబ్బందిని, అనుచరులను ఆదేశించారు. ఈ సందర్భంగా పొంగులేటికి మౌనిక కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

'పొంగులేటి' ఎదుగుదలను చూడలేకే విమర్శలు..

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అండగా పదవులు దక్కించుకున్న వారు, ఇప్పుడు ఆయన ఎదుగుదలను ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని పలువురు పేర్కొన్నారు. ఖమ్మంలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో మలిదశ ఉద్యమకారులు జారె ఆదినారాయణ, బచ్చల పద్మాచారి, చీకటి కార్తీక్, నాయకుడు గోపి తదితరులు మాట్లాడారు. రాజకీయాల్లోకి రాకముందే నుంచే కాంట్రాక్టులు చేసిన శ్రీనివాసరెడ్డి తన సంపాదనలో నుంచి ప్రజాసేవ చేశారని తెలిపారు. ఈ విషయంలో ఆయనను విమర్శించే హక్కు ఉప్పల వెంకటరమణకు కానీ ఇతరులకు లేదని పేర్కొన్నారు.

కేటీఆర్‌పై ఫిర్యాదు

ఖమ్మంరూరల్: బహిరంగ సభలో ప్రధాని నరేంద్రమోదీపై ఉద్దేశపూర్వకంగా పదే పదే కించపరుస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి కేటీఆర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మంగళవారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నకిరికంటి వీరభద్రం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్.శ్రీనివాస్, శాసనాల సాయిరాం, వేణు ఉన్నారు.

రైతాంగాన్ని ఆదుకునేందుకు చర్యలు



నేలకొండపల్లి: అప్పలనరసింహాపురంలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నేలకొండపల్లి/రఘునాథపాలెం: ఇటీవల కురిసిన అధిక వర్షాలతో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ శాఖమూరి సతీష్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలో ముజ్జుగూడెం, అప్పలనరసింహాపురం, కొంగర గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతుల పక్షపాతి సీఎం కేసీఆర్ వెంటనే ఎకరానికి రూ.10 వేల పరిహారం ప్రకటించారని తెలిపారు. ఈ మేరకు మండలంలో క్షేత్రస్థాయిలో అధికారులు, రైతు కన్వీనర్లు పర్యటించి పంట నష్టం వివరాలను సేకరిస్తున్నామన్నారు. మండలంలో దాదాపు 400 ఎకరాలకు పైగా మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. అదే విధంగా రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామాల్లో పంట నష్టంపై మండల వ్యవసాయాధికారి ఇంటూరి భాస్కర్‌రావు పర్యవేక్షణలో ఏఈఓలు సర్వే చేస్తున్నారు. దెబ్బతిన్న ప్రతి రైతు పొలం వద్దకు వెళ్లి పరిశీలించి పొలంలోనే రైతుతో ఫొటో తీసి సమగ్రమైన వివరాలు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.అరుణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెనికె జానకిరామయ్య, రైతు కన్వీనర్ టి.సత్యనారాయణ, గడేటి నరసింహారావు యాదవ్, అంజిబాబు, రామాంజనేయులు, గోవిందా, నారాయణ, వెంకన్న, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సీతారాముల కల్యాణోత్సవాలు



గాంధీచౌక్‌లో ఉత్సవాలకు అలంకరణ

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలోని గాంధీచౌక్ శ్రీరామనవమి ఉత్సవాలకు ముస్తాబైంది. ఇక్కడ శ్రీ సీతారామ చంద్రస్వామి 76వ కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనుండగా, చలువ పందిళ్లు, విద్యుత్ లైట్ల అలంకరణ పూర్తయింది. శ్రీ రామనవమి ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వేములపల్లి వెంకటేశ్వరరావు, వజ్రపు మోహన్, కోశాధికారి కురువెళ్ల జగన్మోహన్‌రావు పర్యవేక్షణలో ఏర్పాట్లు పూర్తిచేయగా, బుధవారం నదీ జలాల ఊరేగింపుతో ఉత్సవాలు మొదలవుతాయి. అలాగే, గురువారం సీతారాముల కల్యాణ మహోత్సవం, మహాన్నదానం ఉంటాయి. ఇక శుక్రవారం శ్రీ సీతారామచంద్ర స్వామికి పట్టాభిషేకం, కనకాభిషేకం, శనివారం హనుమాన్ చాలీసా, ఆదివారం మహాపుష్పయాగం నిర్వహించనున్నారు. ఈసందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ..శ్రీరామనవమికి అన్ని ఏర్పాట్లు చేశామని, భక్తులకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు.

మాదిగలను మోసం చేసిన బీజేపీ



రఘునాథపాలెం: వినతిపత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు

రఘునాథపాలెం/ తిరుమలాయపాలెం: బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణపై పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెడతామని చెప్పి మాదిగలను గత తొమ్మిదేళ్లగా దారుణంగా మోసం చేసిందని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు అశోక్‌మాదిగ అన్నారు. సోమవారం రాత్రి మాదిగల సంగ్రామ యాత్ర రఘునాథపాలెంకు చేరుకోగా.. జిల్లా కో కన్వీనర్, ఖమ్మం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తూరుగంటి అంజయ్య, జిల్లా నాయకుడు గాజుల నరసింహారావు ఘన స్వాగతం పలుకగా.. భిక్షపతి, తిరుమలాయపాలెం మండలంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అశోక్‌లు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలులో లేకపోవడం వల్ల విద్యా, ఉద్యోగ రంగాల్లో మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, దీనికి పూర్తి బాధ్యత బీజేపీదే అన్నారు. బీజేపీ మీద ఒత్తిడి పెంచడానికి ఈ నెల 31న కలెక్టరేట్ ముట్టడి, ఏప్రిల్ 4న హైదరాబాద్ నగర ముట్టడికి మాదిగ ప్రజలంతా పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ పాదయాత్రలో ఎమ్మెస్పీ ఖమ్మం నగర కో ఆర్డినేటర్ తూరుగంటి రాము, ఎమ్మెస్పీ ఖమ్మం నగర, జిల్లా నాయకులు బాకీ శ్రీనివాస్, కనకం జనార్ధన్, బుట్టి నాగేశ్వరరావు, వీరస్వామి, రమేష్ నాయుడు, గాజుల కృష్ణారావు, తురుగంటి సుందర్రావు, కొండ్రు వెంకట్రావు, యాత్ర బృందం జిల్లా నాయకులు తోళ్ల సురేష్, శ్రీకాంత్, లక్ష్మీనారాయణ, గొర్రెపాటి దర్గయ్య, వెంకటేష్, చింతిరాల వినయ్‌కుమార్, ఎంఎస్ఎఫ్ డివిజన్ ఇన్‌చార్జ్ వంగూరి ఆనందరావు, జిల్లా కో కన్వీనర్ ఈదయ్య తదితరులు పాల్గొన్నారు.

నియామకం

తిరుమలాయపాలెం: బీఎస్పీ మండల అధ్యక్షుడిగా హలావత్ బిక్కునాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం తిరుమలాయపాలెంలో పాలేరు అసెంబ్లీ అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యాన జరిగిన సమావేశంలో జరిగిన కమిటీ ఎన్నికల్లో ఆయనను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా జక్కుల యాకయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శిగా వెంకన్న, కార్యదర్శిగా వీరదాస్ రమణ, కోశాధికారిగా తోట సురేష్‌లను ఎన్నుకున్నారు. గతంలో ఉన్న మండల కమిటీని డివిజన్‌స్థాయిలో పనిచేస్తారని తెలిపారు. అదేవిధంగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ పిండిప్రోలు గ్రామానికి చెందిన ఎల్.ప్రవీణ్‌ని బీఎస్పీ నాయకులు పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

'ఎస్‌బీఐటీ' విద్యార్థుల ఫీల్డ్‌ట్రిప్

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాల విద్యార్థులు కామేపల్లి, రఘునాథపాలెం మండలాల్లోని పండితాపురం, జీకే బంజర్‌లో అగ్రిటెక్ ఇంటర్న్‌షిప్‌లో భాగంగా మంగళవారం ఫీల్డ్ ట్రిప్ నిర్వహించినట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా రైతుల పంట సాగులో పెట్టుబడి, దిగుబడి, రాబడి తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీఅండ్ కరస్పాండెంట్ ధాత్రి, అకాడమిక్ డైరెక్టర్లు శివప్రసాద్, ప్రవీణ్‌కుమార్, సుభాష్‌చందర్, రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, రఘునాథపాలెం ఎంపీపీ గౌరి, వ్యవసాయ శాఖ అధికారులు, స్వేచ్ఛ ఫౌండేషన్ సభ్యులు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంకల్ప సత్యాగ్రహ దీక్ష



ఖమ్మంరూరల్: మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



కూసుమంచిలో దీక్ష చేస్తున్న నాయకులు

కూసుమంచి/ఖమ్మంరూరల్/రఘునాథపాలెం: రాహుల్‌గాంధీపై అనర్హత వేటుకు నిరసనగా టీపీసీసీ పిలుపు మేరకు మంగళవారం పలు మండలాల్లో కాంగ్రెస్ నాయకులు సంకల్ప సత్యాగ్రహ దీక్షను చేపట్టారు. కూసుమంచిలో కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు రామసహాయం మాధవీరెడ్డి ఆధ్వర్యంలో, ఖమ్మంరూరల్ మండలంలోని నాయుడుపేట చౌరస్తాలో, రఘునాథపాలెం రాంక్యాతండాలో దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కూసుమంచి దీక్షలో మాధవీరెడ్డి, నాయుడుపేట చౌరస్తాలో పీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు, రాంక్యాతండాలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ పాల్గొని మాట్లాడారు. రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో అనర్హత వేటు వేయటం బీజేపీ ప్రభుత్వ దిగజారుడుకు నిదర్శనమని అన్నారు. కూసుమంచి కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొరివి వెంకటరత్నం, మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు బాణోత్ వినోద, నాయకులు కుక్కల హనుమంతరావు, బెల్లి శ్రీశైలం, లాజర్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొనగా.. నాయుడుపేట చౌరస్తా దీక్షలో కాంగ్రెస్ రూరల్, కూసుమంచి మండలాల అధ్యక్షులు కళ్లెం వెంకటరెడ్డి, మట్టె గురవయ్య, నాయకులు చింతమళ్ల రవికుమార్, మది వీరారెడ్డి, మొక్క శేఖర్, గోనె భుజంగరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రాంక్యాతండా దీక్షలో ఈ కార్యక్రమంలో రఘునాథపాలెం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూక్యబాలాజీ, 2వ డివిజన్ కార్పొరేటర్ మలీదు వెంకటేశ్వర్లు, రబ్బానీ, ఏలూరి రవికుమార్, తెజావాత్ వెంకన్న, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రెంటాల ప్రసాద్ , కె.నాగేశ్వరరావు, మారం కరుణాకర్ రెడ్డి, జి.పాపయ్య, సీహెచ్.రామారావు, పాల్గొన్నారు.

చిరుధాన్యాల ప్రాధాన్యతపై అవగాహన

మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణ్ పక్వాడ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలు, కూరగాయలు, పండ్లు ప్రదర్శనలు చేసి వాటి ప్రాధాన్యతను అధికారులు వివరించారు. అనంతరం చిరుధాన్యాల వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించడంలో పాటు సీమంతాలు నిర్వహించి చీరె సారె అందించి ప్రతిజ్ఞ చేయించారు. – సాక్షి నెట్‌వర్క్



తిరుమలాయపాలెం: చిరుధాన్యాల ప్రాధాన్యతను వివరిస్తున్న అధికారులు



నేలకొండపల్లి: రాజేశ్వరపురంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపర్‌వైజర్ నాగమణి



ఖమ్మంఅర్బన్: గోపాలపురంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న కార్పొరేటర్ సైదులు తదితరులు



ఖమ్మంమయూరిసెంటర్: గర్భిణులకు చీరె-సారె అందజేస్తున్న కార్పొరేటర్ మేడారపు వెంకటేశ్వర్లు